

# సోది సోది వాదం

డియర్ వెంకటేశం, హియర్ కమ్సిరీశం
ఫియర్ హిం నలేశం, మియర్ దిస్సెవేషం.

యవరూ, నువ్వేనా వెంకటేశం! రక్షించావు. ముందా నట్టింటితలుపు జార్లావేసిరా ఎవరేనా చూడగల్రు. వచ్చేటపుడు నా ధోవతి, మీనాన తాటాకుపెట్లోంచి యజ్ఞోపవీతం ఒహటీ పట్టుకురా. చెప్తా...

...మరేమీ లేదు. సింహద్వారం వదలి ఇలా దొడ్డిదోవన ఈ వేషంలో జొరబడేసరికి మీవాళ్ళు యవరైనాచూసి యవడో దొంగాడు జొరబడ్డాడని పొరబడ్తారా ఒళ్లు మళ్ళీ హూనం అవుతుందని, నాయొక్క మెసేజిని

మంత్రబద్ధంచేసి జపిస్తూ వచ్చాను. ఏ యాయవారబ్బ్రాహ్మణేతరుడో అనుకోబోరా అని.

మళ్ళీ హూనవేఁవిటి ఒహమాటయిందా అంటావా. నువ్వా అలా ఇగ్నొరెంట్‌గా మాటాడితే యలాగోయ్. ఔగాని ఆ గొబ్బరుఘ్నాని యిలా , ఈ పీపుమీద కాస్త పట్టించు... నొక్కి-రాయకు. బులబులాగ్గా. మన సినిమా వాళ్ళు సంఘసంస్కరణ చేసినంత బులబులాగ్గా రాయాలిస్మీ...

ఆ... ఏమీఁలేదోయ్. కాస్త డిఫరెన్సాఫొపినియన్ ఏర్పడింది. అంతలోనే వాళ్ళు వాళ్లతప్పు తెలుసుకుని నాలిక్కరిచేసుకుని కాళ్ళాచేతులాబ్రతిమిఁలాడారు... ఏవన్నావూ. విరగ్గొట్ట వొచ్చారనా. యవరంటూ ఆ మాటన్న అయోగ్యుడు. మీమావ కరటకశాస్త్రుల్లే అయితే అతగాడి కెవరు జెప్పారో నాను తెలుసు. ఆ మధురవాణి కూసుంటుంది. దానికి సరసఁవంటే మహా చెడ్డయిది. లేనివి ఊహించి ఉన్నట్టుగా చెప్పడం దానిప్రజ్ఞ.

నీదగ్గిర దాపరికవేఁ వుంది. ఆత్మస్తుతి చేసుకుంటున్నారు మాస్టరుగారని నువ్వనుకున్నాసరే చెప్పేస్తాను విను. చెప్పనిపాపం నాకేల. అమగో ఆ బైస్కోపువాళ్లు ఏడిశారుగా ఊరిచివర—అవుడ్డోరు షూటింగు చెయ్యడానికొచ్చార్ట. తీరాదిగేసరికి, గిరీశంగారీ చాయలే ఉన్నాన్మనుస్మీ, ఒళ్ళు దగ్గర పెట్టుకు పన్చెయ్యి, లేకపోతే ఏ కేస్తాడని యవరో ఆ డైరెక్టరుగాడి చెవులో ఊదార్ట.

హమ్మమ్మ వార్ని దర్శించకపోతే యెలా అని యిదయ్యేట్ట. ఆనక మళ్ళీ నేను కోప్పడతానేమోనని కాకిచేతే కౌరంపించాడు, పొద్దున్న చూళ్ళే?—చుట్టాలొస్తారా గెంతెయ్యి అని నేననేసరికి పందిరిమీద కాకి చెంగున గెంతేసి కావుమని అరిచిందీ? చుట్టాలెవరనుకున్నావుటా.

సరే తీరా ఆషూటింగు చూడబోయేసరికి, డైరెక్టరు డైరెక్షను చెయ్యకపోతే మానె, వేషమైనా కట్టాలని అక్కడి జనాభాఅంతా కాళ్ళావేళ్ళా పడి యిదయ్యేరు. మీ ముచ్చటేల కాదనాలని మేకప్ అయి కామెరా యెదట నిలబడేసరికి సినీజనమంతా డంగయిపోయారంటే నమ్మ.

మనవేసింది విలేజి రౌడీరోలులే. హీరోయిన్ని బలాత్కరించబోతాడు. అంతలో హీరో అడ్డుపడి నన్ను తన్ని—నన్నంటే నా వేషాన్నిలే — ఆ చిన్నదాన్ని కాపాడతాట్ట.

తీరా నేను వేషంకట్టి రెండెక్స్‌ప్రెషన్లు అలా అలా విసిరేసరికి కథ అడ్డం తిరిగిపోయింది.... ఇంకాసిని వేన్నిళ్ళందుకో బాబూ.

యేవుందిటా, ఆ హీరోగాడిగుండె బేజారైపోయి' నేను వీరిపక్కన నటించలేను. వీడు నటరాక్షసుడు బాబోయ్. నన్ను నా సీన్లనీ మింగేస్తాడని ఒహాటే గోల.

ఆవంకా ఆ హీరోయిను నన్ను చూడగానే, పెరుగన్నందగ్గిర మీ మావలా మొహవింత జేసుకుని కథ మార్చాలంది.

తనని నేను బలాత్కరిస్తున్నప్పుడు అడ్డుపడ్డ హీరో ఓడిపోవాలనీ, ఆనక నేనే తనని రాక్షసవివాహమాడాలనీ పట్టు పట్టింది. అంటే విలనే హీరో అయిపోడవం(న్నమాట.

యేమి జేతువుఁ దైవమా అని వాళ్ళు దిగాలు పడిపోయారు. నేను ధైర్యంజెప్పి,ఆ పిల్ల నొప్పించి షూటింగు జరిపించాను.

యాక్టింగులోనే చిక్కొచ్చిందన్నమాట. బలాత్కారపు సీనులో నేను ఆ హీరోయినుమీద ఇమోషన్‌కొద్దీ కాస్త ధాటిగా నటించేసరికి-యువడో ప్రొడ్యూసరు బదరిల్లాట_ వాడు ఫైరయిపోయి వాట్ ఇంత నాచురాల్టీ అక్కర్లేదన్నాడు.

నాకా నువ్వు పాతాళ్చెప్పేదని' నేను మరింత దీనిగా నటించేసరికి వాడు డంగైపోయాడు.

అంత గొప్పగా నటించిన ఆ నా చెయ్యి తనక్కావాలని ఆటోగ్రాఫు చేయించి పట్టుకు చక్కాపోతానని వాళ్ళ ఆఫీసులో నా స్మారకచిహ్నంగా అట్టిపెట్టుకుంటాననీ మా రాముడి పెట్టాడు.

చెయ్యేల, నేనే వస్తానన్నా విన్నాడుగాడు. వాడిలాగే మరి కొందరుకూడా ప్రేమకొద్దీ సొంతానిక్కావాలని ఈ చెయ్యోహరూ, ఆ చెయ్యోహరూ, ఈ కాలోహరూ

ఆ కాలోహరూ, ముక్కోహరూ, చెవులోహరూ లాక్కుబోయారు. శిబిచక్రవర్తి నోమారు తల్చుకొని సరే, తీసుకుపొందందామనుకున్నాగాని నా శాస్త్రికోసం నువ్వూ ముఖ్యంగా మీ సిస్టరూ బెంగెట్టు కిడాతారని.—

యూ ఇడియట్. నవ్వుతున్నావా? నువ్వూ లోకంతో పాటవుతావనుకోలేదు. జరిగింది కొట్లాటయితే వాళ్లు మళ్ళీ నామాట వింటారా చెప్పు. మరి విన్నారు తెలుసా?

ఆఫీసు అవుతూనే షూటింగాపేసి లెక్చరిమ్మన్నారు. ఏకబిగిని ఘంటన్నర లెక్చరు దంచేసరికి జంగై పోయారు రెండోమాటు.

హౌరా! ఇంకానయం యీ శాస్త్రి మరపిచ్చేసి ఏ ముక్కకా ముక్క స్వార్థబుద్ధితో ఏ ముక్కకా ముక్క పట్టుకుపోయి దాచుకుంటే యీలాటి లెక్చర్లు పోగొట్టుకునేవాళ్ళంగదా అని కుమిలి కుమిలి యేడిచారు.

హౌరా మన ఆంధ్రులం ఎంతగొప్పవాళ్ళం! గిరీశంగారు అరిటిపండొలిచినట్టు చెప్పేదాకా యీ సైనం కనుక్కోలేకపోతిమే అని నొచ్చుకున్నారు. వారన్నట్టు మనం బహు దొడ్డవాళ్ళమని గర్వపడ్డారు. లాల్చీలున్నవాళ్లు వినా మిగతా యావన్మంది కాలరెత్తుకున్నారు.

కాదుటోయ్ మరి. తిట్టుకున్నపుడు తిట్టుకున్నాం. మన గొప్పతనం కూడా మనం చెప్పుకోవద్దుటోయ్. పబ్లిసిటీ ఈజ్ ది లైఫాఫిట్ అన్నాడు సీవందొర. కాపోతే మనదేశం సంస్కృతిని సాంప్రదాయాన్ని ఇంతగొప్పగా అర్థంచేసుకుని

ఇలా నష్టపోతూ సినిమాలు తీసినవాడెవడోయ్, తెలుగు వాడు కాక. సత్యాన్వేషణను మన పూర్వులు యెలా సాగించారు ? అదంతా ఫిలాసఫీ అనుకో.

పెద్దలేవన్నారు? అబ్బీ. ఈ సత్యం అనేది ఓ పట్టాన కొరుకుడుపడదురా... పట్టుకు దొరకదురా. పేతీది సత్యంలాగే అవుపిస్తుందిరా. తీరా దగ్గిర్నా వెళ్ళి చూశాక అనుభవమైనాక యిది కాదురా సత్యం అనిపిస్తుందిరా. అది ఎండమావిలా పరుగెత్తిస్తుందిరా.

కావున మనవున్ను అలాగే వెళ్ళి నేతినేతి అనుకుంటూ—నేతి అనగానే చేగోడీలు జ్ఞాపకం చేసుగోకుస్మీ—న యితి అనగా ఇది కాదు అని తాత్పర్యం. ఇదికాదు ఇదికాదు అనుకుంటూ పోతే అయినదేదో తెలీకపోయినా కానివన్నీ బోధపడతాయిగద. ఇపుడు నిన్ను మీ నాన్న అర్ధాంత్రంగా వచ్చిపడి అబ్బిగా పదమూడు పధ్ధానుగు ఎంతరా అంటాడు. అరవై మూడు అంటావు నువు అలవాటు చొప్పున. కాదు అని గూబ కదలేస్తాడు నాన్న. 79 అంటావు. రెండోగూబ కదులుతుంది.

తొంభై నాలుగు కామోసు అంటావు. కాదు అంటూనే పీచెవి మారువేషం వేసుకోబోతుంది. నూట యాభై ఆరా!అంటావు. కాదు. ఇలా పోగాపోగా పదమూడు పధ్ధానుగులెంతో ఓవరకి నీకు తెలీకపోయినా కానివేవేవో కంఠతా వస్తాయిగదా.

అలాగే విడో మారియేజెస్ తీసుకో. ఒక బ్యూటిఫుల్ యంగ్ విడో బుచ్చమ్మకి-ఐమీన్ ఆమె విడో కాక

ముందు ముక్కుపచ్చలారని పసిపిల్లగా వుండగా మీ నాదర ఒక ఓల్డ్ ఫెలోకి కట్టబెట్టేస్తాడు. కాని నిజంగా అది బుచ్చమకు తగునా? యంతమాత్రం తగదు. అందువల్ల తక్షణం దేవుడేంచేస్తాడు. ఇదికాదు అంటాడు. అని ఆ బొట్టు చెరిపేస్తాడు. అలా కాక ముందరే, ఇదేమిటయ్యా గిరీశం వంటి జెమ్‌ని ఇచ్చి పెళ్ళి చెయ్యవయ్యా అంటే మీ నాన్న వినడుగదా. దేవుడే దిగొచ్చినా లాభంలేదుగదా. అంచేత ఆయనా ఆబోరు దక్కించుకోడానికని ఆ పైగానే ఉండి పదమూడు పద్ధానుగులకి నువు చెప్పే జవాబులన్నీ మీ నాన్న కాదు కాదన్నట్టే ఆ పెదనాన్నా మీ నాన్న పనుల్ని కాదంటూ ఉంటాడు. నువ్వైనా చూడు 13 వ యక్కంగూర్చి మరోసారి మీనాన్న అడిగినపుడు ఇన్ని జవాబులు చెప్పవు. అపుడు సొంటిపిక్కలు, తొడపాశాల, మొట్టికాయల సంఖ్య తగ్గుతుంది. అవునా. సుఖపడతావు.... అదే రహస్యం.

బాబూ మన తెలుగు సినిమావారు మహా గొప్ప వేదాంతులు అనడానికిదే ప్రబలసాక్ష్యం. ఈ నేతివాదం పట్టుగుని, ఒకొక్క సినిమా తీసి దెబ్బ తిన్నపుడల్లా ఇది కాదు అని చెంపలేసుకుంటారు. వాళ్ళేకాక మరొకడు కూడా ఆ పొరబాటు చేయడు.

ఈ విధముగా 'హౌనాట్ టు మేక్ఫిల్మ్స్'-అనగా ఒక సినిమాను ఏ విధముగా తీయరాదు, హౌనాట్టు రైట్, యాక్టు, ఎట్లు వ్రాయరాదు, నటించరాదు అన్న ప్రశ్న

లకు జవాబులుగా ఒక్కొక్క చిత్రం ఒక్కొక్క క్లాసిక్కుగా ఉద్గ్రంథంగా తీసేస్తున్నారు మనవారు. ఇంత అపారమైన అపురూపమైన గ్రంథసంపద వేదాల తరవాత మనకొచ్చిం దేవిఁటి?

నేతి నేతి అంటూ మనవాళ్ళు ఇన్ని మహత్తర సిని మాలు లక్షల ఖర్చుతో హైరాణతో లాగి అవతల పారేస్తూవుంటే, ఈ నేతి సినిమాల్ని పట్టుకుని, "మనవంతా నూనెసరుకోయ్" అన్న చెవలాయ యవడంట?

